01042024-DIS-08_Layout 1 4/1/2024 2:12 AM Page 1




# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

# సాహితీ సర్వస్వం కపిలవాయి

నలుగురు ముఖ్యమంత్రులతో సన్మానం చేయించుకున్న ఏకైక సుప్రసిద్ధ కవి, పండితుడు, జ్యోతిష్కుడు, చరిత్రకారుడు, ఉపాధ్యాయుడు కపిలవాయి లింగమూర్తి. సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లో లింగమూర్తి నిష్ణాతుడిగా ప్రసిద్ధి చెందారు. ఉన్నత ప్రమాణాలను పాటించడంలో, వాస్తవిక ప్రదర్శనను ప్రోత్సహించడంలో ఆయనకు ఆయనే సాటి. సాహిత్యానికి ఎనలేని సేవ చేయడమే కాకుండా, అనేక ప్రాచీన తాళపత్ర శాసన రచనలను వెలుగులోకి తీసుకురావడానికి కృషి చేశారు. ప్రాచీన తెలుగు సాహిత్యం, భాష నుంచి సంస్కృతీ నిర్దిష్ట పదాలు, మాండలికాలను సేకరించి వాటి అర్థాన్ని, వాటి వాడుకను వివరించారాయన. ఈ సంకలనం తెలంగాణ భాషకు కపిలవాయి ప్రసాదించిన నిజమైన వరం. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్న తొలి వ్యక్తి కపిలవాయి లింగమూర్తి.

తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా (పూర్వపు హైదరాబాద్ రాష్ట్రం) జినుకుంటలో 1928 మార్చి 31న మాణిక్యమ్మ, కపిలవాయి వెంకటాచలం దంపతులకు లింగమూర్తి జన్మించారు. తన మేనమామ చేవూరి లక్ష్మయ్య పాండిత్యాన్ని చూసి ప్రేరణ పొంది, చిన్నతనం నుంచే ఆయనతో సంభాషించడం ద్వారా శాస్త్ర-చారిత్రక పరిజ్ఞానం, జ్యోతిష నైపుణ్యం, సంస్కృతం-తెలుగు నిఘంటువులపై పట్టు, సాహిత్యంపై అపారమైన ప్రేమను లింగమూర్తి సంపాదించారు.



కపిలవాయి లింగమూర్తి జయంతి సందర్భంగా

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ (తెలుగు సాహిత్యం)లో ఆయన పట్టభద్రుడయ్యారు. 1954లో నాగర్‌కర్నూల్‌లోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరి, ఆ తర్వాత ఎంఓఎల్ (మాస్టర్ ఆఫ్ ఓరియంటల్ లెర్నింగ్)లో శిక్షణ పొంది పాలెంలోని శ్రీ వెంకటేశ్వర ఓరియంటల్ కళాశాలలో 1972లో హిస్టరీ లెక్చరర్‌గా చేరారు. 1983 ఫిబ్రవరిలో పదవీ విరమణ చేశారు. సాహితీవేత్త డాక్టర్ లింగమూర్తి తెలుగు కవిత్వం, తెలుగు గద్యం రెండింటిలోనూ ప్రావీణ్యం సంపాదించారు. తెలుగు సాహిత్యంలో 100కు పైగా పుస్తకాలు రాశారు.

పాలమూరు జిల్లాలోని అనేక ప్రాంతాలు చరిత్రాత్మకతకు ప్రసిద్ధి. మహాక్షేత్రం మామిళ్లపల్లి, భైరవకోన మహత్యం, సోమేశ్వర క్షేత్ర మహత్యం మొదలైన రచనల ద్వారా లింగమూర్తి తమ ప్రాంత ప్రాముఖ్యతను తెలియజెప్పారు. ఆధ్యాత్మిక మార్గంలో కొందరు మహోన్నత వ్యక్తుల జీవిత చరిత్రలు కూడా రాశారు. సాహిత్య సంపుటిలో ఎంతో అభివృద్ధి చెందిన అవగాహన, చరిత్ర పరిజ్ఞానం, పరిశోధన దృక్పథంతో లింగమూర్తి రాసిన నవలలు అనేకం ఉన్నాయి. 'ఉప్పునూతల కథ' అనే నవల ఉప్పునూతల గ్రామ చరిత్ర, అక్కడి ప్రసిద్ధ కేదారేశ్వర ఆలయం చుట్టూ తిరుగుతుంది. యాత్రా కథనంలా సాగే ఈ నవల హిమాలయాల్లోని కేదారేశ్వరానికి కూడా తీసుకెళ్లి అక్కడి సంస్కృతిని చిత్రిస్తుంది. ఆయన రాసిన గోదాదేవి కథ, మూడుతరాల ముచ్చట, నాగమణి, ఆవంచ తదితర నవలలు.. చరిత్ర, మతం, ఆధ్యాత్మికతల వాస్తవిక బలంతో రూపొందినవి. అందువల్ల అవి ప్రసిద్ధికెక్కాయి.

సమీక్షకుడిగా, వ్యాఖ్యాతగా.. యయాతి చరిత్ర, కావ్యగణపతి అష్టోత్తరం, స్వర్ణ శకలాలు వంటి రచనలకు వివరణాత్మక వ్యాఖ్యానం రాశారాయన. కళ్యాణ తారావళి, రుద్రాధ్యాయం, హనుమత్సహస్రం మొదలైనవి కూడా ఆయన రచనలే. లింగమూర్తి సామాజిక, భక్తి నేపథ్యంలో పదకొండు శతకాలను రచించారు. పాలమూరు జిల్లాలో పుట్టి ఎంతో ఎత్తుకు ఎదిగి సాహిత్యరంగంలో వెలిగిన సాహితీవేత్తలెందరో ఉన్నారు. అలాంటి వారిలో కపిలవాయి లింగమూర్తి ఒకరు. కథారచయితగా, నవలా రచయితగా, పరిశోధకుడిగా, కవిగా, జీవిత చరిత్రకారుడిగా, వ్యాసకర్తగా, సంకీర్తనల స్వరకర్తగా, అనువాదకుడిగా, సంపాదకుడిగా, వ్యాఖ్యాతగా నిరూపించుకున్న కపిలవాయి లింగమూర్తి బహుముఖ ప్రజ్ఞాశాలి అనడంలో ఎటువంటి సందేహం లేదు. అనేక విశ్వవిద్యాలయాల సమష్టి కృషితో భారీ పరిశోధన సంస్థను ఆయన రూపొందించారు.

తిరుమల తిరుపతి దేవస్థానం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ఎమ్మెస్కో పబ్లిషర్స్ మొదలైన సంస్థలు లింగమూర్తి రచించిన భారీ సాహిత్య సంకలనాలను ప్రచురించి, ఆయన రచనల ఔన్నత్యాన్ని రుజువు చేశాయి. కపిలవాయి రచించిన 28 విలువైన రచనలు ఇంకా ముద్రణ కావాల్సి ఉంది. పాలమూరు జిల్లాకు చెందిన అనేక సాహితీ సంస్థలకు తన వంతు సహాయ, సహకారాలు అందించారాయన. ఎడిటింగ్‌తో పాటు రచనలను పరిపూర్ణంగా తీర్చిదిద్దడం ద్వారా చాలా మంది వర్ధమాన రచయితలకు సహాయపడ్డారు. సుమారు 300 పుస్తకాలకు ముందుమాట, సమీక్షలు, విలువైన అభిప్రాయాలు రాశారు.

కవితా కళానిధి, పరిశోధన పంచానన, కవి కేసరి, వేదాంత విశారద, గురు శిరోమణి, సాహిత్య స్వర్ణసౌరభ కేసరి వంటి అనేక బిరుదులను కపిలవాయి లింగమూర్తి పొందారు. హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ప్రతిభా పురస్కారం, బూర్గుల రామకృష్ణారావు ప్రతిభా పురస్కారం, చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ సాహితీ పురస్కారం, నోరి నరసింహశాస్త్రి పురస్కారం, కందుకూరు రుద్రకవి పీఠం పురస్కారం, పాల్కురికి సోమనాథ పీఠం పురస్కారాలను ఆయన అందుకున్నారు.

నాగర్‌కర్నూల్‌కు చెందిన వెన్నెల అకాడమీ రూపొందించిన 'కవితా కళానిధి కపిలవాయి లింగమూర్తి' డాక్యుమెంటరీ 2011 సంవత్సరానికి గాను రెండో ఉత్తమ డాక్యుమెంటరీగా ఎంపికై, ప్రతిష్ఠాత్మక నంది అవార్డును గెలుచుకుంది. సుమారు ఏడు దశాబ్దాల పాటు సాహిత్య రంగానికి కపిలవాయి లింగమూర్తి చేసిన విశేష సేవలకు గుర్తింపుగా 2014లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవంలో ఆయనకు గౌరవ డాక్టర్ ఆఫ్ లిటరేచర్ (డీలిట్)ను ప్రదానం చేసింది. ఉస్మానియా, మదురై, తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ఆయన గౌరవ డాక్టరేట్లు పొందారు. లింగమూర్తి సాహిత్య కృషిపై చేసిన రచనల ద్వారా ఆరుగురు పరిశోధక విద్యార్థులు డాక్టరేట్ పట్టాలు పొందారు.

కపిలవాయి లింగమూర్తికి రాష్ట్ర స్థాయిలో అనేక సందర్భాలలో సన్మానాలు జరిగాయి. 1983లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఆయనను సన్మానించారు. తర్వాత ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర సమితి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖరరావు కూడా ఆయనను సన్మానించారు.

మాటల ప్రపంచంలో ప్రతి మలుపును, ప్రతి మైలురాయిని ఆస్వాదించే అలుపెరగని యాత్రికుడాయన. వృత్తి, క్రమశిక్షణ, అంకితభావం, దృఢ సంకల్పంతో తన జీవితానికి సంబంధించిన అందమైన రూపును తీర్చిదిద్దుకున్నారు. 70 ఏండ్ల కిందట తన తొలి సాహిత్య ప్రచురణ తర్వాత ఆయన కలాన్ని కిందకు దించలేదు. తెలంగాణ సాహితీ దిగ్గజం కపిలవాయి లింగమూర్తి 2018 నవంబరు 6న కన్నుమూశారు. సాహితీ లోకం మహోన్నత వ్యక్తిని కోల్పోయినా ఆయన అందించిన సాహిత్యం మాత్రం అజరామరం.

తిరుమల తిరుపతి దేవస్థానం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ఎమెస్కో పబ్లిషర్స్ మొదలైన సంస్థలు లింగమూర్తి రచించిన భారీ సాహిత్య సంకలనాలను ప్రచురించి, ఆయన రచనల ఔన్నత్యాన్ని రుజువు చేశాయి. కపిలవాయి రచించిన 28 విలువైన రచనలు ఇంకా ముద్రణ కావాల్సి ఉంది. పాలమూరు జిల్లాకు చెందిన అనేక సాహితీ సంస్థలకు తన వంతు సహాయ, సహకారాలు అందించారాయన. ఎడిటింగ్‌తో పాటు రచనలను పరిపూర్ణంగా తీర్చిదిద్దడం ద్వారా ఆయన చాలా మంది వర్ధమాన రచయితలకు సహాయపడ్డారు. సుమారు 300 పుస్తకాలకు ముందుమాట, సమీక్షలు, విలువైన అభిప్రాయాలు రాశారు.



సాయి లోహిత పులపా

## నీరటిగాడు



కవంటే... ఎవడనుకున్నారు
భావాల నీటి ధారలను
అక్షరాల మడులకు మర్లేసే
కవిత్వ పంటల నీరటిగాడు

అక్షరాలను నాటినప్పటి నుంచి
కవిత్వ పాదాల మడికట్ల మీదుగా
పరికించి పరికించి చూస్తూ నడుసుకుంటూ పోతాడు
ఏడన్న అక్షరాలకు భావాల తడి తాకక వల్లిపోతా ఉంటే
అక్షరాలకన్నా ముందుగాల కవి
జీవిడిశినంతగా విలవిలలాడుతాడు

ఒక్కొక్క పాదం నిండు జీవంతో ఎదుగుతా ఉంటే
కలల పంటను ఊహించుకుంటూ తానూ
మందిలోనే నిండు కళ్లమోలే ఎలుగుతాడు

ఏ కవి శేన్ల అక్షరాలకు భావపు జల తగ్గినా
వీడు కాసింత భావపు నీటిని మర్లేద్దామనుకుంటాడు
ఏ కవి అక్షరాల పంట ఎండిపోతున్నా
వాడు గిలగిలలాడుతాడు
ఏ కవి అక్షరాల పంట నిండుగా పండినా
నిండుమనసుతో వాని కళ్లల్లో ఎలుగులు నింపుకొంటడు

వాడు శుద్ధాలంకారపు పురుగుమందులు సల్లి
కవిత్వ పంటల సాగు చెయ్యడు
నిజ జీవిత అనుభవాల సహజ ఎరువులనేసి
పచ్చని బతుకు కవిత్వపు పంటలు సాగుజేస్తాడు
నేలంతా పచ్చని కవిత్వమై కళ్లు దెరిస్తే
ఆ కళ్లల్లో వాడు రేపటి కొత్త కలలు కంటాడు!



దిలీప్.వి
84640 30808

## ప్రేమోన్మాదం



ప్రేమకు ఉన్మాదానికి మధ్య హద్దు
చెరిపేసి
మనసులేని మనుషులు కత్తితో ప్రేమ
సామ్రాజ్యాన్ని జయించొచ్చని కలలు
కంటున్నారు..
ఏ మారణాయుధం ప్రేమను సాధించి
జయకేతనం ఎగరేసింది?
అభాగినుల రక్తంతో నడిరోడ్డూ
కేన్వాసుపై
వికృత వాంఛల్ని గీయటం తప్ప!
ప్రేమంటే అందమైన మాంసపు
ముద్దను
సొంతం చేసుకొనే పౌరుషం కాదే
ఆ ముద్ద వెనుక ముగ్ధరాలి మనసెరిగి
నడుచుకునే త్యాగశీలత కదా!
మగతనమంటే వెంటపడి వేధించే
పీడకల కాదే!
అందానికి మనసుంటుందని గుర్తించే
సామాజిక సంస్కారం కదా!
రేపొక ఇంటిని వెలిగించే దీపాన్ని
కత్తికొక ప్రేమగా ఆర్పేస్తుంటే
ప్రతి అందం వెనుక తార్లాడే
మృత్యునీడల్ని
ఎప్పటికీ తప్పించలేమా!
పట్టపగలు నడిరోడ్డులో నలుగురిలో
ఆడది..
రక్షించలేకపోతున్నాం!
మహాత్ముడు చెప్పిన అర్ధరాత్రి ఆడది
ఒంటరిది.. క్షేమంగా ఇల్లు చేరేదెప్పుడు?

(ప్రేమ పేరుతో స్త్రీలపై జరుగుతున్న హత్యాకాండకు నిరసనగా)



భీమవరపు పురుషోత్తమ్
99498 00253

# భిన్న వస్తుశిల్పాల ఆలీబాబా అనేక దొంగలు



కథలు ఎక్కడి నుంచో పుట్టవు. చూసే చూపుండాలే గానీ మనలో నుంచో, ఎదుటవాళ్ల నుంచో, చుట్టుపక్కల వాళ్ల నుంచో బోలెడన్ని కథలు పుడతాయి. అవి తమని కనుక్కోమని మనకు కనీకనిపించని విధంగా సైగలు చేస్తుంటాయి. అటువంటి కథల కోసం జీవితానికి గేలం వేసి కూర్చొని.. కూసింత కదలిక కనపడగానే చురుగ్గా వాటిని లాగి తన బుట్టలో వేసుకుంటాడు ఈ మేలిమి కథకుడు దేశరాజు. కథల వెదుకులాటలో దేశరాజు దేశముదురే.

కథను ఎంతవరకు చెప్పాలో, కథలో వివరాలు ఎంతవరకు ఉండాలో దేశరాజుకు తెలిసినంతగా ఇంకెవరికీ తెలియదనడంలో అతిశయోక్తి లేదు. ఆయన రాసిన కథలను చదివితేనే ఆ విషయం అర్థమవుతుంది. వైవిధ్యమైన కథా వస్తువులను స్వీకరించి, విభిన్నంగా కథ చెప్పాలన్న తపన కథకుడు దేశరాజులో కనపడుతుంది. అందుకు నిదర్శనమే 'ఆలీబాబా అనేక దొంగలు' కథల సంపుటి .

ఈ పుస్తకంలోని వేటికవే సాటి. మొదటి కథ 'కుదుపు'లో పిల్లలు సెల్‌ఫోన్ వాడటం వల్ల జరిగే అనర్థాల గురించి ప్రస్తావించారు. కాలక్షేపం కోసం ఫోన్‌ను ఆశ్రయిస్తున్న పిల్లాపెద్దా ఏ విధంగా ప్రమాదపుటంచులకు ఒరిగిపోతున్నారో తెలిపే కథ ఇది. 'కాసేపు మనిషి' కథలో అవినీతితో అందలమెక్కిన ఒక అధికారి కారుకు ప్రమాదం జరిగి, ఓ వృద్ధురాలి ఇంట్లో ఆశ్రయం పొందుతాడు. గతంలో ఆ అధికారి వృద్ధురాలికి పరోక్షంగా అన్యాయం చేస్తాడు. చివరికి ఆమె నిస్వార్థ గుణాన్ని చూశాక అధికారిలో కలిగిన పరివర్తన అతన్ని 'కాసేపు మనిషి'ని చేస్తుంది.


ప్రకృతికి, పశుపక్ష్యాదులకు మనం ఎంతగా దూరమవుతున్నామో తెలిపే కథ 'సహజాసహజం'. నలగని కథా వస్తువు, నడిపిన కథా సంవిధానం నచ్చి ఖమ్మం ఈస్థటిక్స్‌- 2022 వారు ఈ కథకు పురస్కారం ఇవ్వడం గమనార్హం.

'తల్లీ, కూతురు – మధ్యలో ఆమె' కథ బాలికలు, స్త్రీల పెంపకం గురించి ప్రస్తావిస్తుంది. ఆడపిల్లలు తమ కాళ్లపై తాము నిలబడి, తమ సమస్యలను తామే ఎదుర్కోవాలని ఈ కథ సూచిస్తుంది. సమస్యలను ఎదిరించి నిలబడితే, కొన్ని నిబిడీకృత సంశయాలు వదులుకొని పోరాడితే.. సమస్య మనం అనుకున్నంత పెద్దది కాదని ఈ కథ చెప్తుంది.

'కవి దుర్భేద్య' కథ ఒక వ్యంగ్య విస్ఫోటనం. తరచి చూడాలే గానీ ప్రతివాడూ 'బహురూపి' కథలోని అతడులానో, ఆమెలానో ఉంటారు. కాకపోతే కథలు, వెతలు మారతాయి. ఈ పదమూడు కథల్లో అక్కడక్కడా వచ్చే కథకుడి సునిశిత పరిశీలన ఆశ్చర్యం కలిగిస్తుంది. నేరుగా సందేశాలిచ్చే కాలం కాదిది. చాలా కథల్లో పాత్రలకు పేర్లు లేకపోవడం గమనార్హం.

అనేక పొరలు తొలుచుకుంటూ వెళ్లాల్సిన కథ 'ఆలీబాబా అనేక దొంగలు'. ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని, అధికారమే పరమావధిగా చేసే మతతత్వ ప్రచారాల్లో.. మన వేలితోనే మన కండ్లను పొడుస్తున్నారనే విషయాన్ని మనం మర్చిపోతాం. అజ్ఞానం ఇచ్చే ఆనందాన్ని హాయిగా అనుభవిస్తుంటాం. హిందూ ధర్మం మర్మమెరిగినవాడు, ఇస్లాం మత సహనం తెలిసినవాడు ఈ మత్తులో పడడు. అందుకే 'కండ్లు తెరవండి' అంటున్నాడు కథకుడు. తరాలుగా వస్తున్న పొరపొచ్చాలను ఒలుచుకొని, మత విద్వేషాల నుంచి బుర్రలు ప్రక్షాళన చేసుకోవాలని చెప్తూ.. కథకుడు ఈ కథ చెప్పడంలో చాలా మెలకువ ప్రదర్శించారు. కథా సంపుటికి ఈ పేరు పెట్టడం సబబే.

(ఈ కథలను కారా మాష్టారు శత జయంతి సంవత్సరం సందర్భంగా ఆయనకు అంకితమివ్వడం విశేషం)



పి.శ్రీనివాస్ గౌడ్
99494 29449

## టాబ్లెట్ బాక్స్



డైనింగ్ టేబుల్ మీదకు
కొత్త అతిథి టాబ్లెట్ బాక్స్

పాన్ డబ్బాను తోసేసి
తన స్థానం శిలాఫలకం వేసుకుంది
అన్నం గిన్నె కంటే
టాబ్లెట్ బాక్స్ పెద్దది ఇప్పుడు

ప్రతి భోజనానికీ
అఫిక్స్, సఫిక్స్ మాత్రలు
పక్కా గోలీ మింగాల్సిందే
మూడు పూటలు ముచ్చటగా

తీరొక్క రంగుల ఆకారాలు
తీపి రోగాలకు అల్సర్ పోరాటానికి
గుర్తులు పెట్టుకుని గుటుక్కుమని
గుండె చివరి చరణం వరకూ...

ప్రతి ప్రయాణంలో తోడు అదే
మరిచిపోయానంటే మళ్లీ వెనక్కు
పిల్లల తొలి ఆత్మీయ పలుకు గోలీలదే
వేసుకోలేదంటే చిరు మందలింపు

పింఛన్ అంతా ఊడ్చుకుపోతుంది
పిల్లలను అడగాలంటే అహం అడ్డు
ఆదాయం లేని వాళ్ల అగచాట్లు ఎన్నో
నీళ్లు మింగి దేవునిపై భారం వేయడమే

ఇంతింతై... అన్నట్టుగా
టాబ్లెట్ బాక్స్ ఎదిగి ఎదిగి
కాఫిన్ బాక్స్‌ను దాటేటట్టుంది
మట్టిని దేహం మీద కప్పుకొనే లోపు

చితిలో కూడా
నా చెయ్యి తడుముతూనే ఉంటుందేమో
టాబ్లెట్ బాక్స్ కోసం
ఎక్కడ పెట్టి సచ్చానని...



దాసరి మోహన్
99853 09080

# కష్టజీవి కన్నీటికి చిరునామా

'పేదవాడిగా పుట్టడం నీ తప్పు కాదు, కానీ పేదవాడిగా చనిపోవడం మాత్రం నీ తప్పే' అని ఓ మహనీయుడు చెప్పిన మాట అక్షర సత్యం. సమస్యలను సాకుగా చూపుతూ.. విజయం సాధించలేకపోయామని చెప్తూ చాలామంది తమ ప్రయత్న లోపాలను కప్పిపుచ్చుకుంటారు. మరికొందరు మాత్రం ఆటంకాలు, అవమానాలు ఎదురైనా అనుకున్న లక్ష్యాలను సాధించి, ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు.

అలా విజయం సాధించినవారిలో కొందరు తమ అనుభవాలను రచనలు, నవలల రూపంలో నేటి యువతకు అందిస్తూ స్ఫూర్తిగా నిలుస్తారు. అటువంటి వారిలో ఒకరు భారత డైనమిక్ లిమిటెడ్ (బీడీఎల్) చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ వెన్నం ఉపేందర్. ఆయన కలం నుంచి జాలువారిన 'మత్తడి దునికిన కోపుల నీళ్లు' నవల ఎంతోమందికి స్ఫూర్తిదాయకం.

రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన వెన్నం ఉపేందర్ స్వగ్రామం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలోని గుమ్మడవెల్లి. కాలే కడుపుకు కాసిన్ని నీళ్లు, సలిపించే గాయానికి కాసింత పసుమూత్రం పూత అన్నట్టుగా.. ఉపేందర్ ఆకలి ఆర్తనాదానికి కాసిన్ని నీళ్లే ఊరట. పేదోడికి గాయమైతే గాయం నొప్పి కంటే పైసల కోసం తండ్లాడే నొప్పే ఎక్కువ. ఆశయం కోసం ఆకలిని అదిమిపెట్టిన ఉపేందర్.. అకుంఠిత దీక్షతో పుస్తకాల పురుగయ్యారు. ఆయన జీవన ప్రస్థానం ఇతివృత్తంగా అక్షరీకరించిన నవలే 'మత్తడి దునికిన కోపుల నీళ్లు'. ఈ నవల ద్వారా యువతకు అమూల్యమైన సందేశాన్ని అందించారాయన. ఈ నవల నేపథ్యమైన 'ఆకలి భౌతికం-ఆవేదన మానసికం' పాఠకులను విశేషంగా ఆకట్టుకుంటుంది.



కాలినడకన రోజూ 16 కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తూ ఆయన చదువుకున్న తీరును 'హైస్కూల్ చదువులు – అమ్మపు చినుకుల స్పర్శలు'లో వివరించిన విధానం పాఠకుల హృదయాలను ద్రవింపజేస్తుంది. చెప్పులు కొనలేని దుస్థితి, కాలికి గుచ్చుకునే ముళ్లు, రోజు కోసారి వచ్చిపోయే ఎర్ర బస్సులను చూస్తే.. మనమూ బాల్య స్మృతుల్లోకి వెళ్లిపోతాం.

నాయనంటే ఏడాదికోమారు వికసించే జ్ఞాపకం. 'నాయనున్నప్పుడు జుర్రుకోవాలన్న సోయి లేదు, జారిపోయాక జాడ లేదు' అంటూ పాఠకులను కంటతడి పెట్టిస్తూ.. తన హృదయాంతరాల్లో గూడుకట్టుకున్న భావాలకు జీవం పోశారు ఉపేందర్. 'నాయన బతికుండగా ఆయనకు అన్నం పెట్టని నా చదువు.. నాయన తీసుకునే అప్పు పత్రాలు రాయడానికి మాత్రం పనికొచ్చింది' అంటూ తన నిస్సహాయతను వ్యక్తం చేశారు రచయిత. లోకమంతా సదువు బంద్ చేసి, నాలుగు రూపాయలు వచ్చే పని చేయమన్నప్పుడు.. 'నువ్వు చదువుకోవాలి బిడ్డ. నువ్వు సదివి పెద్ద కొలువులు జెయ్యాలి. నీ కష్టాలు, నష్టాలు నేను చూసుకుంటా బిడ్డ' అని నాడు అమ్మ చెప్పిన మాటలను అక్షరీకరించి పాఠకులను ఉద్వేగానికి గురి చేశారాయన.

కష్టపడని తనముంటే కష్టాలను నిందించకు!
కలం రాయలేకుంటే కాగితాన్ని నిందించకు!

ఈ సృష్టిలో ప్రతి ఒక్కరికీ ఆటంకాలు ఎదురవడం సహజమే. కానీ, ఆశయం దిశగా అడుగులు వేస్తూ, అడ్డంకులను అవకాశాలుగా మార్చుకున్నప్పుడే విజయం మీ చెంతకు చేరుతుంది. వాస్తవ ఘటనలను కథావస్తువుగా ఎంచుకుని తనలోని భావాలను కథలోని పాత్రల ద్వారా పాఠకుల గుండెల్లో గుచ్చుకునేలా చెప్పిన తీరును అభినందించడానికి మాటలు సరిపోవని చెప్పడం ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. నేటి యువతకు ఉపయోగపడే మరిన్ని నవలలు వెన్నం ఉపేందర్ కలం నుంచి జాలువారాలని ఒక పాఠకుడిగా ఆకాంక్షిస్తున్నా.



కోట దామోదర్
93914 80475

## ఆహ్వానం

### పరిచయ సభ

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటో తేదీ రాత్రి 7.30 గంటలకు కందుకూరి శ్రీరాములు రచించిన 'పలకల నుంచి పలుకుల వైపు' కవితా సంపుటి పరిచయ సభ జూమ్ వేదికగా జరుగుతుంది. బెల్లంకొండ సంపత్ కుమార్ అధ్యక్షుడిగా, నందిని సిధారెడ్డి ముఖ్య అతిథిగా, నాళేశ్వరం శంకరం, కందాళై రాఘవాచార్య, కొండపల్లి నీహారిణి ప్రసంగిస్తారు. కందుకూరి శ్రీరాములు కవి పలుకులు చెప్తారు. దూళిపాళ అరుణ కృతజ్ఞతలు తెలుపుతారు.

### సత్కారం

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఏప్రిల్ 7న మధ్యాహ్నం 2 గంటలకు జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షులు ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి 80వ జన్మదినం సందర్భంగా కవులు అంపశయ్య నవీన్‌కు పురస్కార ప్రదానం, ఎలనాగకు సత్కారం జరుగుతాయి. డా.అమ్మంగి వేణుగోపాల్, వాణీదేవి సురభి, డీకే సమరసింహారెడ్డి, పీవీ ప్రభాకరరావు, వెలుదండ నిత్యానందరావు, డా.వై.రామకృష్ణారావు తదితరులు పాల్గొంటారు.